హ్యాట్రిక్ హీరో మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధించారు. 2014 నుంచి తన మెజార్టీని పెంచుకుంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తున్నారు. 2014లో 40వేల మెజార్టీ, 2018లో 42వేల మెజార్టీ మూడోసారి ఏకంగా 70వేల ఓట్లతో గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిలిచారు. దీంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నారు. – కూకట్‌పల్లి

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు ప్రతి రౌండ్‌లో మెజార్టీ సాధిస్తూ తన ఆధిపత్యాన్ని చూపించారు. మొదటి రౌండ్ నుంచి 22వ రౌండ్ వరకు ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ 70405 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. నియోజకవర్గంలో ఎల్లవేళలా అందుబాటులో ఉండే మాధవరం కృష్ణారావును అన్ని వర్గాల ప్రజలు ఆదరించారు. కుల, మత, ప్రాంత బేధాభిప్రాయం లేకుండా అన్ని వర్గాల వారు ఆయనకు ఓటు వేసి విజయాన్ని చేకూర్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా నడుస్తున్నప్పటికీ కూకట్‌పల్లిలో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో గెలిచారు. స్థానికంగా సెటిలర్స్ కాంగ్రెస్‌కు ఓటు వేస్తారని ప్రచారం జరిగినప్పటికీ సెటిలర్స్ నుంచి కూడా భారీ స్థాయిలో మాధవరం కృష్ణారావుకు ఓట్లు పోలయ్యాయి.

◆ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు..

కూకట్‌పల్లి నియోజకవర్గంలో మొత్తం 4,63,864 ఓట్లు ఉన్నాయి. గత నెల 30వ తేదీన జరిగిన ఎన్నికల్లో 2,50,064 ఓట్లు పోలయ్యాయి. అందులో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు 1,35,635 ఓట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్‌కు 65,248 ఓట్లు, జనసేన పార్టీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్‌కు 39830 ఓట్లు వచ్చాయి. ప్రధాన పార్టీ అభ్యర్థులకు తప్ప మిగతా అభ్యర్థులకు నోటా ఓట్ల కంటే తక్కువ వచ్చాయి. నోటాకు 2446 ఓట్లు రాగా, బీఎస్పీకి 1371 ఓట్లు వచ్చాయి. కాగా స్వతంత్ర అభ్యర్థి బాశెట్టి నర్సింగ్‌రావుకు 1769 ఓట్లు వచ్చాయి.



ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లిలో రౌండ్ల వారీగా వివరాలు

రౌండ్	కృష్ణారావు (బీఆర్‌ఎస్)	ప్రేమకుమార్ (జనసేన)	బండి రమేష్ (కాంగ్రెస్)
1	7304	3726	2196
2	6864	3042	1492
3	6092	2855	1618
4	7005	2717	1775
5	7330	2671	1995
6	8104	1984	1312
7	6953	3048	1684
8	6703	2910	1639
9	5291	2889	2163
10	6503	3815	2937
11	7223	3456	2291
12	5791	3879	2185
13	9424	3105	820
14	5806	2525	788
15	7274	2657	932
16	4949	2881	2503
17	5558	3322	2551
18	4826	2839	2266
19	5497	4633	2356
20	4573	3456	2242
21	6006	2366	1855
22	200	95	111
పోస్టల్ బ్యాలెట్	359	377	119
మొత్తం	135635	65248	39830

(బ్యాలెట్ ఓట్లతో కలిపి)





నియోజకవర్గంలో సంబరాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు





కలిసొచ్చిన అదృష్టం

- అనుహ్యంగా టికెట్ దక్కించుకున్న మర్రి.. వరించిన విజయం
- టికెట్ తిరస్కరించి కాంగ్రెస్ గూటికి మైనంపల్లి.. ఎదురైన పరాజయం
- మెదక్‌లో తనయుడు రోహిత్ విజయం..
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుపై సంతోషంలో మైనంపల్లి

సాక్షి, మేడ్చల్ జిల్లా: అనుహ్యంగా బీఆర్‌ఎస్ టికెట్ దక్కించున్న చామకూర మల్లారెడ్డి స్వయాన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి మల్కాజిగిరిలో విజయం వరించింది. తనయుడి కోసం బీఆర్‌ఎస్ అధిష్టానం ప్రకటించిన టికెట్‌ను తిరస్కరించిన సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ గూటికి చేరి.. అదే నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేసినా ఆయనకు దురదృష్టం వెంటాడటంపై స్థానికంగా చర్చ సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందే బీఆర్‌ఎస్ అధిష్టానం అభ్యర్థులను ప్రకటించగా, కొన్నిచోట్ల వివాదం రాజుకుంది. మల్కాజిగిరి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును అభ్యర్థిగా బీఆర్‌ఎస్ అధిష్టానం ప్రకటించగా, తన కుమారుడు రోహిత్‌కు మెదక్ టికెట్ ఇవ్వలేదన్న ఆగ్రహంతో మంత్రి హరీష్‌రావుపై పలు విమర్శలు చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న బీఆర్‌ఎస్ మల్కాజిగిరి టికెట్‌ను పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి మల్లారెడ్డికి స్వయాన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఖరారు చేసింది. ఈ నేపథ్యంలోనే మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మర్రి రాజశేఖర్‌రెడ్డి అసెంబ్లీ బరిలోకి దిగి, విజయం సాధించారు.

◆ తనయుడికి బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వకపోటంతో.. అధిష్టానంపై అలిగిన సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మైనంపల్లి తాను అనుకున్నట్లుగానే మెదక్ నుంచి తనయుడు రోహిత్‌కు కాంగ్రెస్ టికెట్ ఇప్పించడంతో పాటు ఆయన కూడా మల్కాజిగిరి నుంచి పోటీ చేశారు. అనూహ్య రాజకీయ పరిణామాల్లో భాగంగా రాష్ట్రమంతటా కాంగ్రెస్ గాలి వీచినా.. మైనపంల్లి మాత్రం మల్కాజిగిరి నుంచి ఓటమి పాలయ్యారు. అయితే.. కుమారుడు రోహిత్ మాత్రం మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. తాను ఓడిపోయినా తనయుడు రోహిత్ గెలుపొందడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుండటంపై ఆయన సంతోషంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

పోరాడి ఓడిన తోటకూర వజ్రేష్

అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నుంచి పోరాడి ఓడిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్(జంగయ్య) యాదవ్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తమ ప్రభుత్వంతో కొట్లాడతానని పేర్కొంటున్నారు. అనూహ్యంగా ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాల అభ్యర్థిగా ప్రజల మద్దతు కూడగట్టడంతో పాటు ఒక ధనవంతుడిని ఢీ కొట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను కాపాడతానని హామీ ఇచ్చారు. ధనబలంతో మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ ఎన్నికల్లో గెలిచినట్లు ఆరోపిస్తున్నారు.



కార్తీక వన భోజనాలు

సాక్షి సిటీ బ్యూరో: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని దూలపల్లిలోని కార్తీక వనంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనభోజనాలు నిర్వహించారు. ఏపీలోని బాపట్ల జిల్లా మోదుకూరు గ్రామ ప్రజలు.. మన గ్రామం–మన ప్రజలు పేరిట వనభోజన కార్యక్రమాన్ని ఆనందోత్సవాల నడుమ నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేసి దీపాలు వెలిగించారు. అనంతరంపిల్లలకు క్రీడాపోటీలు నిర్వహించారు.



యూటీఎఫ్ సీనియర్ నాయకుడు దత్ మృతి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర యూటీఎఫ్ సీనియర్ నాయకులు దత్ అనారోగ్యంతో మృతి చెందారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకులుగా గుర్తింపు పొందిన అక్షయ కుమార్ దత్(77) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమరావతి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి 2004లో ఉద్యోగ విరమణ పొందారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా, రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్, చైర్మన్, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పాటు పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం హైదరాబాద్ నగరంలో స్థిరపడ్డారు. అప్పటి నుంచి 2021 వరకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో కార్యకర్తగా పనిచేశారు.ఆయన మృతి పట్ల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది.



హ్యాట్రిక్ విజయం సాధించిన మాధవరం కృష్ణారావును కలసి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్, నాయకులు



ఓల్డ్ బోయిన్‌పల్లి బీఆర్‌ఎస్ కార్యాలయం ముందు సంబురాలు జరుపుకుంటున్న నాయకులు, మహిళలు

విజయోత్సాహం

- మాధవరం కృష్ణారావు గెలుపుతో గులాబీ శ్రేణుల సంబురాలు
- డ్యాన్సులు చేస్తూ.. స్వీట్లు పంచుతూ హర్షం వ్యక్తం చేసిన నేతలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి/మూసాపేట: కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చుతూ జై తెలంగాణ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు అభిమానులు డ్యాన్స్ ఆడుతూ.. స్వీట్లు పంచుతూ తమ ఆనందాన్ని వ్యక్త పరిచారు. మాధవరం కృష్ణారావును కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, సీనియర్ నాయకులు నరేందర్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, బల్‌రాజు, బుర్రి యాదగిరి, మక్కాల సత్యనారాయణ, వీరాస్వామి, చందుయాదవ్, ఇబ్బు, లలితా, శాలిని, దుర్గ, అంబటి శ్రీనివాస్,నర్సింగ్, జగదీష్, చున్నూ పాషా, కొండల్ తదితరులు పాల్గొన్నారు.



హ్యాట్రిక్ సాధించిన మాధవరం కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్



బాలాజీనగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్ బాబూరావు తదితరులు



కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు విజయంతో సంబరాలు చేసుకుంటున్న నాయకులు, కార్యకర్తలు



మాధవరం కృష్ణారావు విజయంతో బాలాజీనగర్‌లో సంబరాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు

కాంగ్రెస్ శ్రేణుల్లో విజయానందం



మూసాపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబరాలు

మూసాపేట: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం పెల్లుబికింది. ఆదివారం మూసాపేటలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పార్టీ జెండా పట్టుకొని జై కాంగ్రెస్... జై రేవంత్‌రెడ్డి అంటూ నినాదాలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.



గాంధీ భవన్‌లో జరిగిన సంబురాల్లో పాల్గొన్న దండుగుల యాదగిరి, మల్లికార్జునయాదవ్

అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా అరెకపూడి గాంధీ హ్యాట్రిక్ విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం పలు డివిజన్ల కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. పలు చౌరాస్తాలలో యువకులు నృత్యాలు చేస్తూ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం భరతనాట్య కళాకారిణి అనూష తన ప్రదర్శనతో అలరించింది. ఇందులో మేళప్రాప్తి, కృతి, రారా రాజీవలోచన, పదం, శ్రీసరస్వతీ ఆశ్రయామి అంశాలను ప్రదర్శించారు. ప్రముఖ నాట్యగురువు నిర్మలా ప్రభాకర్ శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఇందులో శ్లోకాలు, వినాయకస్తుతి, అలరిపు, శివస్తుతి, త్యాగరాజ కీర్తన, తరంగం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాకారులు ప్రముఖ గురువు అంజుబాబు, సువర్ణలత, కుసుమ భోగరాజు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం అభినందనీయం

మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఘనవిజయం సాధించడంపట్ల మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య హర్షం వ్యక్తం చేశారు, మాలల పంతం బీజేపీ అంతం అనే నినాదంతో తాము ఈ ఎన్నికల్లో పనిచేసి కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించామని, అభ్యర్థుల గెలుపునకు మాల, మాల ఉపకులాల వారు శ్రమించి పనిచేశారని తెలిపారు. ఆదివారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ వైఖరివల్ల కాంగ్రెస్‌కు మద్దతు పలికామన్నారు. బీజేపీ నిలబెట్టిన 20 ఎస్సీ స్థానాల్లో అభ్యర్థులు ఓడిపోయారని, మాదిగ అభ్యర్థులు కూడా ఓడిపోవడంతో మాదిగల ఓట్లు పార్టీలుగా చీలిపోయాయని అర్థం అవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం బీజేపీకి కలిసిరాలేదని, కర్నాటకలో కూడా ఎస్సీ రిజర్వేషన్ అని ఓడిపోయిందని, తెలంగాణలో కూడా అదే జరిగిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా బీజేపీ తనవైఖరిపై పునరాలోచించాలని, లేకపోతే దేశవ్యాప్తంగా తగిన మూల్యం చెల్లించక తప్పదని చెన్నయ్య హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణపై వెనక్కి తగ్గకపోతే మాలల పంతం బీజేపీ అంతం అనే నినాదం దేశవ్యాప్తంగా తీసుకెళ్లి బీజేపీని బొందపెడతామన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొంతవరకు నిజమైన డిమాండ్ అని తెలుగు రాష్ట్రలు విడిపోయిన తర్వాత కాలం చెల్లిన డిమాండ్ అయిపోయిందన్నారు. దళితులందరూ కలసికట్టుగా రాజ్యాధికారం కోసం పోరాడాలని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్ మన్నె శ్రీధర్ రావు, మోజెస్, గోకుల కళ్యాణ్, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.